
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3 సిద్దిపేట

ఆదివారం 1 సెప్టెంబరు 2024

జైబోలో.. మట్టిగణపతి

ప్రకృతి హితం.. పూజకు శ్రేష్ఠం



మట్టిగణపతిని తీర్చిదిద్దుతున్న తయారీదారుడు

- జిల్లాలో జోరుగా తయారీ
- ఈసారి వాటికే మొగ్గు
- రంగురంగుల్లో మట్టి ప్రతిమలు లభ్యం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31 : వినాయక చవితి సందడి మొదలైంది. అయితే మండపంలో ఏ ప్రతిమను ప్రతిష్ఠించాలనే విషయంలో నిర్వాహకులు ఆచితూచిగా వ్యవహరిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారైన విగ్రహాల వినియోగంతో పర్యావణానికి ముప్పు వాటిల్లుతున్నది. దీనిపై పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేయడంతోపాటు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో క్రమంగా ప్రజల ఆలోచన విధానంలోనూ మార్పు మొదలైంది. ఏటా మట్టి గణపతుల వాడకం పెరుగుతున్నది. దీంతో తయారీదారులు ప్రజల అభిరుచులకు అనుగుణంగా పెద్ద సైజుల్లో రంగు రంగుల రకరకాల రూపాల్లో మట్టి గణపతులను తీర్చిదిద్దుతున్నారు.

సిద్దిపేటలోనే తయారీ..



వివిధ ఎత్తుల్లో మట్టి వినాయకులు

సిద్దిపేట నుంచి ముస్తాబాద్ రోడు వైపు నాగదేవతాలయం సమీపంలో ఓ కుటుంబం మట్టి గణపతులను తయారు చేస్తూ ఉపాధి పొందుతుంది. చిన్నగుండవెల్లికి చెందిన రాములు, లక్ష్మి దంపతుల ఇద్దరు కొడుకులు మహేష్, రాజశేఖర్‌తో పాటుగా అల్లుడు సత్యంతో కలిసి మట్టి ప్రతిమలను తయారు చేస్తున్నారు. వీళ్ల వృత్తి కుండలు తయారు చేయడం.. కానీ నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో వినాయకుల తయారీలో శిక్షణ పొందారు. అప్పటినుంచి సిద్దిపేటలో మట్టి వినాయకులను తయారు చేసి అమ్ముతున్నారు. వచ్చే ఏడాది నుంచి దేవి నవరాత్రులకు అమ్మవారి విగ్రహాలను కూడా తయారు చేస్తామని చెబుతున్నారు. ఆరు ఇంచుల నుంచి 7 ఫీట్ల వరకు విగ్రహాలు తయారుచేస్తున్నారు. నేచురల్ కలర్స్ వాడి ప్రతిమలను కలర్‌ఫుల్‌గా తీర్చిదిద్దుతున్నారు. వీరే కాకుండా సిద్దిపేటకు చెందిన కట్కూరు రవీందర్ అనే వ్యక్తి కూడా మట్టి వినాయకులను తయారుచేస్తున్నాడు.



వివిధ రంగుల్లో వినాయకుడి మట్టి ప్రతిమలు



ఎంఏ చదివాను..

నేను ఎంఏ పూర్తిచేశాను. ఉద్యోగావకాశాలు లేకపోవటంతో కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాను. ప్రస్తుతం ప్రజల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలు వినియోగించొద్దని అవగాహన వస్తుంది. ఏటా మట్టి ప్రతిమల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటే మాకు భరోసాగా ఉంటుంది.

-మహేష్, మట్టి ప్రతిమలు అమ్మేవ్యక్తి



ఈసారిమట్టి గణపతే..

మేము గతేడాది మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించాం. మంచిగా అనిపించింది. అందుకే ఈసారి కూడా ఇప్పటికే మట్టి ప్రతిమను కొనుగోలు చేసి సిద్దిపేటకు తెచ్చాం. కెమికల్స్ వాడి తయారు చేస్తున్న విగ్రహాలతో పర్యావరణం దెబ్బతింటుంది.

-భాను, వివేకానంద యూత్



డ్రైఫ్రూట్ ఆంజనేయుడు

శ్రావణమాసం చివరి శనివారం, శనిత్రయోదశి పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ పంచముఖ ఆంజనేయుడిని వివిధ రకాల డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

-సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31



సిద్దిపేటలో కురుస్తున్న వర్షం



ముసురుపట్టింది..

- జిల్లాలో రోజంతా వర్షం
- అప్రమత్తమైన అధికారులు
- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు
- వరుస వర్షాల నేపథ్యంలో ఏర్పాటు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31: జిల్లాలో శనివారం ఉదయం నుంచి ముసురుపట్టింది. పలు చోట్ల భారీగా, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. గండిపల్లి 21.8 మిల్లీ మీటర్లు, కట్కూర్ 16.8, సముద్రాల 12.3, కోహెడ 8.5, రేంబర్తి 8.3 మి.మీ వర్షం పడింది. ఈ వానతో ఆరు తడి పంటలకు మేలు జరుగనుండడంతో రైతులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడతో వరద ధాటికి మురుగునీరు రోడ్డుపై పొంగిపొర్లింది.

కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ మనుచౌదరి శనివారం వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 2200 చెరువులు ఉండగా, ఇప్పటికే 600 చెరువుల పూర్తిగా నిండాయని. ప్రస్తుత వరుస వర్షాలతో చెరువులు, కుంటలు తెగే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని, టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్ రెడ్డిలు, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, డీపీవో దేవకీదేవి, డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



జేజే డ్రెస్సెస్ ఏరియాలో రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీరు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

ఫోన్ నంబర్: 8457230000

పోలీస్ కంట్రోల్ రూం

వాట్సాప్ నంబర్: 8712667100

పోలీస్ అలర్ట్

సిద్దిపేట క్రైం: రెండు, మూడు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. మట్టితో కట్టిన పురాతన ఇండ్లలో నివాసం ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయసహకారాలు అందించాలని తెలిపారు. వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ 8712667100 నెంబర్లకు సమాచారం అందించాలని ప్రజలను సూచించారు. అలాగే, కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో ఆమె పెండింగ్ కేసులను సమీక్షించారు.

హడలెత్తిస్తున్న హైడ్రా..

పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో కమిషనర్ పర్యటన

నగర శివారు సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం పర్యటించారు. ఇప్పటికే పలుమార్లు ఆయన పటాన్‌చెరు ప్రాంతాలపై ఫోకస్ పెట్టగా.. అక్రమార్కులు హడలెత్తిపోతున్నారు. శనివారం ఆయన పటాన్‌చెరులోని సాకి చెరువు, శాంతినగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలను, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ నిర్మించిన రోడ్డును పరిశీలించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడలోని శంభునికుంటను, అమీన్‌పూర్ గ్రామ శివారులోని సంబిచెరువును పరిశీలించారు. చెరువులు, కుంటల పరిధిలో జరిగిన ఆక్రమణలు, గొలుసుకట్టు కాల్వలను పూడ్చి నిర్మించిన ఇండ్ల వివరాలతో కూడిన నివేదిక సిద్ధం చేసి నోటీసులు జారీ చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

- పటాన్‌చెరు, ఆగస్టు 31



బీరంగూడా శంభునికుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వంటేరు నరేందర్‌రెడ్డి

పాలకవర్గం నియామకం



గజ్వేల్, ఆగస్టు 31: గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి చెందిన వంటేరు నరేందర్‌రెడ్డిని, వైస్ చైర్మన్‌గా గజ్వేల్ పట్టణానికి చెందిన సర్దార్‌ఖాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. 'ఆంధ్రజ్యోతి' ముందస్తుగా చెప్పిన వారికే పదవులు ఖరారయ్యాయి. డైరెక్టర్లుగా అక్కారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ యాదగిరి, జాలిగామ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నర్సాగౌడ్, ప్రజ్ఞాపూర్‌కు చెందిన వెంకటస్వామితో పాటు గజ్వేల్ వ్యవసాయ శాఖ ఏడీ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పాక్స్ చైర్మన్‌తో పాటు మరి కొందరిని డైరెక్టర్లుగా నియమించినట్లు తెలిసింది.

సాగులో రైతునేస్తం

శాస్త్రవేత్తలతో నేరుగా సందేహాల నివృత్తి

- జిల్లాలో 23 రైతు వేదికల్లో యూనిట్లు
- ప్రతీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్




మిట్టపల్లి రైతువేదికలో రైతునేస్తం ప్రారంభంలో కలెక్టర్ మనుచౌదరి, ఇన్‌సెట్‌లో వీడియోకాన్ఫరెన్స్ యూనిట్ (ఫైల్)

సిద్దిపేట రూరల్, ఆగస్టు 31 : రైతులకు సాగులో మెళకువలు నేర్పేందుకు ప్రభుత్వం 'రైతు నేస్తం' పేరుతో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు ప్రతీ మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు రైతులతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేయడం దీన్ని ముఖ్య ఉద్దేశం. మొదటి విడతగా 23 మండలాల్లో ఒక్కో రైతు వేదికను ఎంపిక చేసి రైతునేస్తం యూనిట్లను ఏర్పాటు చేశారు.

సాగు, రైతు పథకాలపై అవగాహన

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సాగులో నూతన పద్ధతులు, పంటల సస్య రక్షణ, తెగుళ్ల నివారణ వంటి అంశాలతో పాటు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న బీమా, రుణాలు, పథకాలపై అవగాహన కల్పిస్తారు. పంటలకు సోకిన తెగుళ్లను వీడియో కాన్ఫరెన్స్‌లో నేరుగా చూపించే వీలుగా ఉండడడంతో సాగు సమస్యలకు సత్వర పరిష్కారం లభించనుంది. కాగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు, క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలకు రైతుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది.

ఇదొక మంచి అవకాశం..



పంటల సాగులో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇదొక మంచి అవకాశం. వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు బాగున్నాయి. తెగుళ్ల నివారణకు సత్వర పరిష్కార మార్గాలను చెబుతున్నారు. రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతున్నది.

-కొల్పుల యాదయ్య, రైతు, గుడికందుల, తొగుట మండలం

రైతులకు ఎంతో మేలు



రైతులు దూరం వెళ్లకుండా వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలతో మాట్లాడుతుండడంతో ఎన్నో సందేహాలకు సమధానం దొరుకుతున్నది. మండల స్థాయిలోనే రైతులకు శిక్షణ, పంటల సస్య రక్షణ, తెగుళ్ల నివారణపై సలహాలివ్వడంతో ఎంతో మేలు జరుగుతున్నది. ఇలాంటి కార్యాక్రమాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- పద్మ, ఏడీఏ, సిద్దిపేట

డిసెంబర్‌కల్లా పనులన్నీ పూర్తిచేయాలి

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ఫరూఖీ



గృహజ్యోతి అమలును మహిళను అడిగి తెలుసుకుంటున్న ముషారఫ్‌ఫరూఖీ

సిద్దిపేటటౌన్, ఆగస్టు 31 : సిద్దిపేట సర్కిల్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో డిసెంబర్ వరకు అన్ని అభివృద్ధి పనులను పూర్తిచేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్‌ఫరూఖీ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని విద్యుత్ భవన్‌ను ఆయన సందర్శించి, అధికారులతో సమావేశమయ్యారు. విద్యుత్ డిమాండ్, సరఫరా, గృహ జ్యోతి పథకం అమలు, సిద్దిపేట సర్కిల్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరాతీశారు. ఫీల్డ్ అధికారులు విధిగా ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్‌ను చెక్ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇందిరమ్మ బస్తీలో సందర్శించి ప్రజలను గృహ జ్యోతి పథక అమలుపై ఆరా తీశారు. పంటపొలాల వద్దకు వెళ్లి రైతులతో విద్యుత్ సరఫరా మాట్లాడారు. అలాగే నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నర్సింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ భిక్షపతి, ఎస్‌ఈ చంద్రశేఖర్, డీఈలు మహేష్‌కుమార్, లక్ష్మీనారాయణ, శ్రీనాథ్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ఆశ్రిత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



సిద్దిపేట టౌన్, ఆగస్టు31 : ఎట్టకేలకు సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి పాలనకు ముగింపు పడింది. ఏడాదిలో నలుగురు కమిషనర్లు మారడంతో కల్వకుర్తి మున్సిపల్ నుంచి ఇక్కడకు బదిలీ అయిన కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ బాధ్యతలు చేపడుతారా లేదా అనే చర్చ జరిగింది. కాగా, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, సుడా వైస్‌చైర్మన్‌గా ఆశ్రిత్‌కుమార్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

మల్లన్నసాగర్‌లోకి గోదావరి జలాలు

- రెండు పంపులతో కొనసాగుతున్న ఎత్తిపోతలు
- ప్రస్తుతం రిజర్వాయర్‌లో 11.10 టీఎంసీల నీరు



రెండు డెలివరీ సిస్టర్న్ నుంచి రిజర్వాయర్‌లోకి విడుదలవుతున్న నీరు, పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

తొగుట, ఆగస్టు 31: మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రాజన్న సిరిసిల్లా జిల్లాలోని మిడ్‌మానేరులోకి అక్కడి నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేశారు. ఈ రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి, అక్కడి నుంచి మల్లన్నసాగర్‌లోకి గోదావరి జలాలను విడుదల చేస్తున్నారు. 50 టీఎంసీ సామర్థ్యం గల మల్లన్నసాగర్‌లో రెండో విడతగా ఈ నెల 26న నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. అంతకు ముందు రిజర్వాయర్‌లో 10.30 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఐదు రోజులగా పంపింగ్ చేసిన అధికారులు 2.30 టీఎంసీలను రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. అందులో నుంచి మరో రిజర్వాయర్ కొండపోచమ్మసాగర్‌లోకి 1.50 టీఎంసీల నీటిని పంపింగ్ చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో 11.10 టీఎంసీల నీరు ఉంది. రైతుల యాసంగి పంటలను దృష్టిలో పెట్టుకుని మరోమారు నీటిని ఎత్తిపోయాలని శనివారం ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రెండు పంపుల ద్వారా ప్రతీరోజు 2,600 క్యూసెక్కుల నీటి ఎత్తిపోస్తున్నట్లు డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు నీటి ఎత్తిపోతలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

మత్తు వదలరా..!

- జీజీహెచ్‌లో డీఅడిక్షన్ సెంటర్
- మత్తుకు బానిసైనవారికి చికిత్స
- ప్రత్యేక వార్డులో 15 బెడ్లు ఏర్పాటు
- నెలకు 400మందికి పైగా రోగులు



నా పేరు మురళి.. మాది నగునూరు మండలం రాంపూర్. మద్యానికి బానిస కావడంతో తరచూ ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవలు జరిగేవి. ఒకానొక సమయంలో బావిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నిస్తే నా భార్య రక్షించింది. సిద్దిపేటలో డీఅడిక్షన్ కేంద్రానికి వచ్చి 20 రోజులైంది. ఇప్పుడు బయటకు వెళ్లినా మద్యం తాగాలని అనిపించడం లేదు.



నా పేరు రాజు.. మాది వరదరాజుపల్లి. నిత్యం మద్యం తాగుతూ నా లోకంలో నేనుండేవాడిని. భార్యతో పాటు కుటుంబాన్నీ పట్టించుకునేవాడిని కాదు. మద్యం మాన్పించేందుకు ఇక్కడికి తీసుకువచ్చారు. మద్యానికి బానిసై ఇప్పటివరకు జీవితంలో ఏమి కోల్పోయానో అర్థమైంది. దీంతో మద్యం జోలికి వెళ్లొద్దని నిర్ణయం తీసుకున్నాను.

సిద్దిపేట టౌన్, ఆగస్టు31 : మత్తు పదార్థాలకు బానిసగా మారినవారితో పాటు డిప్రెషన్‌కు గురైన వారిని తిరిగి మాములు మనిషిలా చేసేందుకు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నడుం బిగించారు. అందుకు కోసం ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో డీఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వారికి చికిత్స అందిస్తున్నారు.

15 బెడ్లు ఏర్పాటు..

గత ప్రభుత్వం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డీఅడిక్షన్ కేంద్రాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డీఅడిక్షన్ కేంద్రాల్లో మార్పును తీసుకొస్తూ ప్రత్యేక వార్డు కేటాయించి అందులో దాదాపు 15 బెడ్‌లను ఏర్పాటు చేసింది. సదరు వార్డుల్లో ప్రత్యేకంగా వైద్యులు, సిబ్బంది, ఫర్నిచర్‌తో పాటు మందులు, ఇంజక్షన్‌లు సైతం అందుబాటులో ఉంచింది.

నెలకు 400మందికి పైగా చికిత్స..

ఈ డీఅడిక్షన్ కేంద్రానికి సిద్దిపేట జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచీ రోగులు వస్తున్నారు. నెలకు 400 మందికి పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలోనే ఉచితంగా భోజనం అందిస్తున్నారు. ఇదే ప్రైవేట్ డీఅడిక్షన్ కేంద్రాల్లో చికిత్స పొందితే నెలకు రూ.15 వేలకు పైగా వసూలు చేస్తున్నారు.

కౌన్సెలింగ్‌తో మార్పునకు కృషి..

డీఅడిక్షన్ సెంటర్‌కు వస్తున్న రోగులకు ముందుగా సైక్రియాటిస్టులు కౌన్సెలింగ్ చేస్తూ వ్యసనాల నుంచి వారు విముక్తి పొందేందుకు కృషి చేస్తున్నారు. అనంతరం వారిని కేంద్రంలో చేర్పించుకొని అవసరాన్ని బట్టి వారం నుంచి నెల రోజుల పాటు చికిత్స అందిస్తున్నారు. ఫలితంగా చాలామంది రోగులు చెడు వ్యసనాలకు దూరమయ్యారని వెద్యులు తెలిపారు. డిశ్చార్జి తరువాత కూడా ప్రతి నెలా ఆసుపత్రికి రప్పించి వైద్య పరీక్షలు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జీజీహెచ్‌లో డీఅడిక్షన్ కేంద్రాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలి. వైద్య బృందం మీకు కుటుంబసభ్యుల్లా అండగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డ్రగ్స్ ఫ్రీ సొసైటీలో అందరూ భాగస్వాములు కావాలి. చెడు వ్యసనం నుంచి బయటపడేలా చేసి మీకు కొత్త జీవితాన్ని అందిస్తాం.

-డాక్టర్ కిశోర్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

చిన్న తగాదాలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

● హుస్నాబాద్ కోర్టు న్యాయాధికారి శివరంజని



మాట్లాడుతున్న శివరంజని

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 31 : చిన్న చిన్న తగాదాలతో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని హుస్నాబాద్ కోర్టు న్యాయాధికారి శివరంజని పేర్కొన్నారు. శనివారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో నాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 28న జాతీయ మెగా లోక్‌అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. కక్షిదారులు పట్టింపులకు పోకుండా రాజీమార్గం ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ ఎగ్గోజు సదానందం, కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు సాయిని మల్లేశం, డీకొండ ప్రవీణ్, మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఉత్పత్తిదారుల నుంచి వ్యాపారులుగా మారాలి

● సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31 : రైతులు ఉత్పత్తిదారుల నుంచి వ్యాపారులుగా మార్చడమే ఎఫ్‌పీవో(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) ముఖ్య ఉద్దేశం అని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఎఫ్‌పీవో కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డబ్ల్యూఆర్ రెడ్డి, ఏపీ-మాస్ సీఈవో టీసీఎస్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సాగుభూమి వివరాలు, పంటల ఉత్పత్తి, ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులలో చైతన్యం రావాడానికి గ్రామాల్లో, మండలాల్లో ఎఫ్‌పీవో డైరెక్టర్లు, సీఈవోలు సభ్యులు కలిసి సమావేశాలు నిర్వహించి వీటి ప్రాముఖ్యాన్ని తెలపాలన్నారు. ప్రతీ సంవత్సరం ఎఫ్‌పీవోల జనరల్‌బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, జిల్లా అధికారులను ఆహ్వానించాలన్నారు. వారు సమస్యలు తెలిపి వారి సలహాలు, సూచనలు మేరకు నడుచుకోవాలని సూచించారు. రైతుల ఆలోచనలో మార్పు తీసుకొచ్చి మార్కెట్ డిమాండ్‌కి తగినట్లుగా వినూత్నమైన పద్ధతిలో స్థానిక అవసరాలను దృష్టి పెట్టుకొని, పంటలు వేయాలని తెలిపారు. దిగుబడిని మార్కెటింగ్ చేయడం కోసం పలు కంపెనీలతో అనుసంధానం కావాలని, దీంతో పంటలకు మంచి ధర వస్తుందని పేర్కొన్నారు. రైతులను ప్రోత్సహించడానికి విజయవంతమైన ఎఫ్‌పీవోల పనులను క్షేత్రస్థాయిలో చూపించాలన్నారు. ఈ ఎఫ్‌పీవోలను అభివృద్ధి పథంలో నడపడానికి జిల్లా యంత్రాంగం తరఫున ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి కట్టుబడి ఉన్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నిఖిల్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సువర్ణ, డీఏవో రాధిక, ఎల్డీఎం హరిబాబు, డీఆర్డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



మల్గ రవి(ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 31 : మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్గ రవి(48) కొన్ని రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద మద్యం సేవించి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం హుటాహుటిన నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. రవికి భార్య సుగుణ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

ఉద్యోగ విరమణ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదు

● సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 31 : ఉద్యోగ విరమణ వృత్తికే కానీ, వ్యక్తిత్వానికి కాదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. ఎస్ఐ నరెడ్ల ఇంద్రసేనా రెడ్డి పదవీవిరమణ కార్యక్రమాన్ని కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఇంద్రసేనారెడ్డిని అభినందించి, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అత్యవసరం అయినప్పుడు రిటైర్డ్ పోలీస్ అధికారుల సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్‌రెడ్డి, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కోహీర్, ఆగస్టు 31 : కోహీర్‌లో శుక్రవారం రాత్రి 30 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. కోహీర్ గ్రామానికి చెందిన అఫ్రోజ్ కోహీర్ పట్టణంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ బియ్యం వ్యాపారాన్ని చేస్తున్నాడని సీసీఎస్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు తనిఖీలు నిర్వహించి అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. లబ్ధిదారుల నుంచి కిలోల చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అద్దెకు తీసుకున్న ఓ ఇంట్లో డంపు చేసి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సీజ్ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కోహీర్ పోలిస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

కిరాణ దుకాణం దగ్ధం.. రూ.2 లక్షల నష్టం

నారాయణఖేడ్, ఆగస్టు 31 : ఖేడ్ మండలం పైడిపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ దుకాణం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పెద్దగొల్ల శంకర్ ఇంట్లోనే కిరాణ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజులాగే శుక్రవారం రాత్రి దుకాణం మూసి కుటుంబీకులతోపాటు భోజనం చేసి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో దుకాణంలో నుంచి మంటలు ఎగిసిపడుతుండగా, కుటుంబీకులు మేల్కొనడంతో పాటు చుట్టుపక్కల గృహాల వారు గుర్తించారు. మంటలను అదుపు చేశారు. దీంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. రూ.2 లక్షల నష్టం జరిగి ఉపాధిని కోల్పోయానని బాధితుడు తెలిపాడు.

నత్తనడకన ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు


హుస్నాబాద్ బస్టాండ్ ప్రధాన ద్వారం

మంత్రి పొన్నం శంకుస్థాపన చేసి ఆరునెలలు..
- ఇంకా పూర్తి కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులు

హుస్నాబాద్, ఆగస్టు 31: హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో శంకుస్థాపన జరిగి ఆరునెలల గడుస్తున్నా ఇప్పటికీ 50 శాతం పనులు కూడా పూర్తికాలేదు. మరో ఆరునెలలు గడిచినా పూర్తయ్యే అవకాశాలు కనబడటం లేదని జరుగుతున్న పనులను చూస్తే అవగతమవుతుంది. ఈ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.2 కోట్లు మంజూరు చేయడంతో నాలుగు దశాబ్దాల తర్వాత దీనికి మహర్దశ రాబోతుందని ఈ ప్రాంత ప్రజలు సంతోషపడ్డారు. శిథిలావస్థకు చేరిన ఈ బస్టాండ్ రూపురేఖలు మారబోతున్నాయని సంబురపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మార్చి 8న ఈ పనులకు శంకుస్థాపన చేశారు. మార్చి 21వ తేదీ నుంచి పనులు షురూ చేశారు. అప్పటి నుంచి పనులు మందకొడిగానే జరుగుతున్నాయి.

40 ఏళ్ల తర్వాత పూర్తి దశలో ఆధునీకరణ..

హుస్నాబాద్ బస్టాండ్‌ను 1984 జూన్ 17న అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ బొప్పరాజు లక్ష్మీకాంతారావు కృషితో నాటి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సంగంరెడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అప్పుడు మూడువరకు ప్లాట్ ఫామ్‌లుండేవి. తదనంతరం పలుమార్లు రిపేర్లు చేశారు. మళ్లీ 14 ఆగస్టు 2017న రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి రూ.33.59 లక్షలు మంజూరు చేశారు. అప్పుడు అందులో ఉన్న హోటల్ గదులను తొలగించి విశాలంగా చేసి ఆధునీకరించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో 8 ప్లాట్ ఫామ్‌లుండగా అదనంగా మరో మూడు ప్లాట్ ఫామ్‌లు నిర్మిస్తున్నారు. 40 ఏళ్ల తర్వాత బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరించుటకు నిధులు మంజూరు కాగా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇక్కడి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు..

బస్టాండ్ ఆధునీకరణ పనులకు రూ.2 కోట్లు మంజూరు కాగా.. తూర్పు వైపు ఒక ప్లాట్ ఫాం, పడమర వైపు రెండు ప్లాట్ ఫామ్‌లు నిర్మించాల్సి ఉంది. అదనంగా నిర్మిస్తున్న రెండు ప్లాట్‌ఫామ్‌ల వైపు టాయ్‌లెట్స్‌ను నిర్మాణం చేస్తున్నారు. బస్టాండ్ ముందు ఎలివేషన్ చేయాల్సి ఉంది. గ్రానైట్, రేయిలింగ్ వంటి పనులతో ఆధునీకరించాల్సి ఉండగా ఇంకా ఈ పనులు ప్రారంభం కాలేదు. బస్టాండ్ ఆవరణలో సీసీ నిర్మాణం సగం మాత్రమే చేసి మిగతాది నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటివరకు ప్లాట్‌ఫామ్‌కు తీసిన గోతులతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడ్డారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తున్నా గడువులోపు పూర్తి చేస్తామని అంటున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ పనులు వేగంగా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చెక్కుల పంపిణీలో రసాభాస

● బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం


చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

కౌడిపల్లి, ఆగస్టు 31: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో రసాభాస నెలకొని, కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు తోపులాడుకున్నారు. ఈ సంఘటన కౌడిపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయం ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం జరిగింది. మండలంలోని 79 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, రాజకీయాలు తనకు కొత్తేమీ కాదని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని తెలపడంతో బీఆర్ఎస్ నాయకులు 'జై సునీతమ్మ' అని అనడంతో.. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు 'జై రేవంత్‌రెడ్డి' అని అన్నారు. దీంతో ఇరువర్గాల నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో సభా ప్రాంగణం హోరెత్తింది. చివరకు ఒకరినొకరు తోచుకునే వరకు వచ్చింది. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరుపార్టీల నాయకులకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే ఎలా పంపిణీ చేస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు రాజునాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సార రామగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్, మాజీ సర్పంచ్ కాంతారావు, శ్యాంసుందర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, పాష తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన సిద్దిపేట కలెక్టర్


జిల్లా న్యాయాధికారి సాయిరమాదేవికి పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 31: సిద్దిపేట జిల్లా న్యాయాధికారి కె.సాయిరమాదేవిని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోర్టు కాంప్లెక్స్‌లో కలెక్టర్ మనుచౌదరి శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న న్యాయ వ్యవస్థకు సంబంధించిన విషయాల గురించి కాసేపు చర్చించారు.

దోస్త్ మేరా దోస్త్..!

● గేదెపై శునకం సవారీ


రేగోడు గ్రామ సమీపంలో గేదెపై కూర్చున్న శునకం

రేగోడు, ఆగస్టు 31: అప్పుడప్పుడు జంతువులు తమ జాతి వైరుధ్యం, వైరాన్ని మరిచిపోయి స్నేహంగా ఉంటాయి. ఆప్యాయంగా మెలుగుతుంటాయి.. అలాంటి ఘటనే మెదక్ జిల్లా రేగోడు మండలంలో చోటు చేసుకున్నది. శనివారం రేగోడు పరిధిలోని పెద్దశంకరంపేట రహదారిపై ఓ గేదెపై శునకం కూర్చుని తిరగడం పలువురిని ఆశ్చర్యపరిచింది. ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కడంతో క్లిక్‌మనిపించింది.




సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధాకృష్ణ చౌహాన్, జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు,

సెక్స్ వర్కర్ల సంక్షేమం కోసం కృషి

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 31: సెక్స్ వర్కర్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగకుండా శాంతియుత సమాజాన్ని నిర్మించేందుకు న్యాయవాదులు, పోలీసులు, వివిధ సంఘాల నాయకులు కృషిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధాకృష్ణ చౌహాన్ కోరారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సెక్స్ వర్కర్ల హక్కులపై సంగ్రామ్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్స్ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కమిటీ చేసిన సిఫార్సుల గురించి వివరించారు. శాంతిభద్రతల విధివిధానాల్లో విద్య ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు మాట్లాడుతూ వేశ్య వృత్తి యుగయుగాలుగా కొనసాగుతుందని, ఈ వృత్తిలో ఉన్న మహిళలకు ఇతర జీవనోపాధి చూపించి వారి జీవన విధానాల్లో మార్పు కోసం పోలీసుశాఖ కృషి చేస్తున్నదన్నారు. జిల్లా మహిళా శిశుశాఖ అధికారి లలితకుమారి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్, హిజ్రాల సంక్షేమం కోసం తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ జ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అవంతిక తంగెళ్లతో పాటు పోలీసు, విద్యాశాఖ అధికారులు, సఖి కేంద్రం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఐడీఎస్‌ఎంటీ ఫేజ్-2కు న్యాయం చేయండి

● ఆందోళనకు దిగిన దరఖాస్తుదారులు ● ఈనెలాఖరులోగా పరిష్కరిస్తామన్న చైర్మన్ చంద్రపాల్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: చిన్న, మధ్యస్థ పట్టణాల సమగ్ర అభివృద్ధి (ఐడీఎస్‌ఎంటీ) ఫేజ్-2 బాధితులకు న్యాయం చేయాలంటూ లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. శనివారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగిన అనంతరం చైర్మన్ చంద్రపాల్, పాలకవర్గాన్ని వారు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఫేజ్ -1లో స్థలాలు దక్కని వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళనకు దిగారు. ఎన్నోఏళ్లుగా తమకు స్థలాలు కేటాయించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేజ్-1లో 21 మందికి పైగా, ఫేజ్-2లో 40 మందికి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. కొన్నిరోజులుగా తామంతా ఏకమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చామని చెప్పారు. నేడు కౌన్సిల్ సమావేశమున్నందున కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. సమావేశం ముగియగానే చైర్మన్ కలిసి తమ సమస్యను తెలియజేశామన్నారు. తమకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని కోరగా చైర్మన్ స్పందిస్తూ తామంతా అదే పనిలో ఉన్నామని, ఈనెలాఖరులోగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు హామీఇచ్చారని తెలిపారు.

మృతిచెంది మూడునెలలైనా న్యాయం జరగట్లేదు

● ఉద్యోగం ఇవ్వడం లేదంటూ 'మున్సిపల్' ఎదుట ఆందోళన
● తల్లి ఫొటోతో బైఠాయించిన కుటుంబీకులు


మృతిచెందిన తల్లి ఫొటోతో ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 31: తమ తల్లి మృతిచెంది మూడునెలలైనా.. తమకు న్యాయం చేయడం లేదని కుటుంబీకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. ఓవైపు మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగా కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. మెదక్ పట్టణానికి చెందిన అయితారం దుర్గమ్మ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తూ మే నెలలో మృతిచెందిందని కుమారులు ప్రభాకర్, గణేష్ తెలిపారు. అనంతరం తమకు రావాల్సిన ప్రయోజనాలు రాలేదని, ఈ విషయంలో మున్సిపల్ అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. కార్యాలయంలో సంప్రదిస్తే స్పందన లేదని, నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి మృతి అనంతరం ప్రయోజనాలతో పాటు ఉద్యోగం పెద్ద కుమారుడు ప్రభాకర్‌కు ఇవ్వాలని కుటుంబసభ్యులు రాసి ఇచ్చినా.. చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఏమన్నంటే కలెక్టర్ కార్యాలయానికి లేఖ రాశామని.. అక్కడ చూసుకోవాలని ఓ అధికారి అలసత్వ సమాధానమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మృతికి ముందు అనారోగ్యానికి గురవడంతో సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేశామని.. అందుకు సంబంధించి కాగితాలు ఇవ్వడం లేదని, ప్రశ్నిస్తే మున్సిపల్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని అధికారులు దుర్భాషలాడుతున్నారని వాపోయారు.

తమ వద్ద పెండింగ్ లేదు

అయితారం దుర్గమ్మ మృతి అనంతరం కుటుంబీకులకు రావాల్సిన ప్రయోజనాల విషయంలో అన్ని చర్యలు తీసుకున్నామని కమిషనర్ జానకీరాంసాగర్ తెలిపారు. ఇప్పటికే కొన్ని ఫైళ్లు ఖజానా కార్యాలయానికి, మరికొన్ని ఫైళ్లు కలెక్టర్ కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. వీటిపై అదనపు కలెక్టర్ సంతకాలు కూడా పూర్తయ్యాయని వివరించారు. అనవసరంగా మృతురాలి కుటుంబీకులు ప్రతిరోజు మున్సిపల్ సిబ్బందితో దుర్భాషలాడుతున్నారని కమిషనర్ తెలిపారు. తమ వద్ద వారికి రావాల్సిన ప్రయోజనాల విషయంలో ఎటువంటి పెండింగ్ ఫైళ్లు లేకపోగా, వాటి కోసం తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని వివరణ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతిచెందిన పెంటప్ప

జహీరాబాద్, ఆగస్టు 31: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామానికి చెందిన పెంటప్ప(65) తన వ్యవసాయ పొలంలో పనులను చేసుకునేందుకు సైకిల్‌పై వెళ్తున్నాడు. మండలంలోని గోపలన్‌పల్లి చౌరస్తాలో 65వ నంబరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా.. శనివారం మధ్యాహ్నం జహీరాబాద్ నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో పెంటప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

చాకరిమెట్లలో శ్రావణ శోభ


చాకరిమెట్ల ఆలయంలోని హోమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట, ఆగస్టు 31: శివ్వంపేట మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన ప్రముఖ క్షేత్రం సహకార ఆంజనేయస్వామి ఆలయంలో చివరి శనివారాన్ని పురస్కరించుకుని శ్రావణ శోభ సంతరించుకున్నది. ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, చందన విశేష పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకుని హోమంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి సార శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దేవదత్తశర్మ, పూజారులు ప్రభు రాజశర్మ పాల్గొన్నారు.

రామలింగేశ్వర గుట్టకు పాదయాత్ర

కల్హేర్, ఆగస్టు 31: శ్రావణమాసం ఆఖరి శనివారం కావడంతో మండల పరిధిలోని మాసాన్‌పల్లి చౌరస్తా సమీపంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయ వ్యవస్థాపకుడు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు పాదయాత్ర చేపట్టారు. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు చెందిన భక్తుల ఆరాధ్యదైవమైన కామారెడ్డి జిల్లా పిట్లం మండల పరిధిలోని రామలింగేశ్వరగుట్ట వరకు పాదయాత్ర చేపట్టారు. సీతా రామ లక్ష్మణ, ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలతో చేపట్టిన పాదయాత్ర బ్రాహ్మణపల్లి, నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా, జక్కాపూర్, మల్లూర్, అన్నారం, కిష్టాపూర్ గ్రామాలమీదుగా రామలింగేశ్వరగుట్టకు పాదయాత్ర చేరుకుంది. కల్హేర్ మండల పరిధిలోని మాసాన్‌పల్లి, మహాదేవ్‌పల్లి, దేవునిపల్లి, కల్హేర్, రాపర్తి, ఖానాపూర్(బి), బాచేపల్లి, కామారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లి, వెలగనూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, ఆరేడ్, అచ్చంపేట, నిజాంసాగర్ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. పాదయాత్ర మధ్యలో భక్తులకు మల్లూర్ గ్రామానికి చెందిన ముస్లింలు పండ్లు, మంచినీళ్లు అందజేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు.

హనుమాన్ ఆలయంలో భక్తుల కిటకిట

నారాయణఖేడ్, ఆగస్టు 31: నారాయణఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు దర్శనం కోసం పోటెత్తారు. శ్రావణ మాసంలో చివరి శనివారం, శనిత్రయోదశి కావడంతో తెల్లవారుజామునే ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో అభిషేకం, చందనం, మహాహారతి నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ఆశీస్సులు అందజేశారు. కాగా ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్ ఆలయంలోనూ భక్తులు దర్శనం కోసం వచ్చారు.

సెప్టెంబరు 2న కుంకుమార్చన

నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ మందిరంలో శ్రావణమాసం చివరి సోమవారం అమావాస్యను పురస్కరించుకుని సాయంత్రం 5 గంటల నుంచి ఉమాపార్థివ లింగార్చన సహిత కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఖేడ్‌లోని కాశీనాథ్ ఆలయంలో సెప్టెంబరు 2న శ్రావణ మాసం చివరిరోజు సోమాపతి అమావాస్య, రుద్రయాగం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అర్చకుడు గురురాజ్‌జ్యోషి తెలిపారు.


నారాయణఖేడ్: బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప ఆశీస్సులు పొందుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

సోమాయప్ప ఆశీస్సులు పొందిన ఎంపీ

జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని బీచ్కుంద మఠాన్ని సందర్శించారు. బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప ఎంపీ సురేష్ షెట్కార్‌కు ఆశీస్సులు అందజేశారు. ఖేడ్ శివారులోని ఎంపీపీ కార్యాలయం ఎదుట రాంరావు మహరాజ్ ట్రస్టులో ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం నుంచి జగదాంబ భవానీ మాత 41 రోజుల దీక్షధారణ నిర్వహించనున్నట్లు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ అన్నారు.

ఆలయాల్లో శనిత్రయోదశి పూజలు

ఝరాసంగం, ఆగస్టు 31: మండల పరిధిలోని ఏడాకులపల్లి, బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా భక్తులు తైలం, నువ్వులు, నల్లవస్త్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఏడాకులపల్లి గ్రామ శివారులోని సప్తపూరి శనిఘాటులో పూజలు చేసి, మొక్కుకున్నారు.

నల్లూరులో నిర్విరామ భజన

జిన్నారం, ఆగస్టు 31: నల్లూరులోని ఆలయంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 3 వరకు భక్తులు నిర్విరామ భజన నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 12, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6, 6 నుంచి రాత్రి 12 గంటల వరకు, 12 నుంచి ఉదయం 6 గంటల వరకు నాలుగు బృందాలుగా భజన చేపట్టారు. శనివారంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

భద్రత, భరోసా కోసమే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం

● మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ అర్బన్, ఆగస్టు 31: ప్రజల భద్రత, భరోసా కోసమే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అవుసులపల్లిలో కమ్యూనిటీ కనెక్ట్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం ద్వారా నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీసు యంత్రాంగం దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ప్రజలకు అభద్రతా భావం లేకుండా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 31: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన జొన్నగడ్డల రామవ్వ(70)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రామవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. శనివారం ఉదయం పెద్ద కుమారుడు తల్లి ఆచూకీ కోసం వెతుకుతుండగా.. గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. రామవ్వ కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందుతున్నట్లు పెద్ద కుమారుడు వెంకటయ్య తెలిపాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీస్‌లో చోరీకి యత్నం

హవేళిఘణపూర్, ఆగస్టు 31: మెదక్ కలెక్టర్ కార్యాలయంలోని రెండో అంతస్తులో ఉన్న జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి కార్యాలయంలో దుండగుడు చోరీకి యత్నించినట్లు హవేళిఘణపూర్ ఎస్ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రెండో ఫ్లోర్‌లో ఉన్న జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసులో దొంగతనం చేసేందుకు తలుపులు పగులగొట్టే ప్రయత్నం చేశాడు. అవి రాకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాడని ఎస్ఐ తెలిపారు.

కారును ఢీకొన్న బస్సు

● నలుగురికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

హత్నూర, ఆగస్టు 31: ఆర్టీసీ బస్సు కారును ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సిరిపురం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకున్నది. గుమ్మడిదల మండలం దాచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అతని భార్య నర్మద, కూతురు శ్రీనిధి, కుమారుడు, తల్లి భ్రమరాంబతో కలిసి నర్సాపూర్ నుంచి మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరీదేవి దర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సిరిపుర గ్రామ శివారులోకి వెళ్లగానే జోగిపేట నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి కారును ఒక్కసారిగా ఢీకొట్టింది. దీంతో కారు బోల్తా పడి నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గాయపడ్డ నలుగురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు రాలేదన్నారు.

ఇంటి పన్నుల తగ్గింపునకు తీర్మానం

● తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ

తూప్రాన్, ఆగస్టు 31: ఇంటి పన్నులను తగ్గించాలని తీర్మానం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ పేర్కొన్నారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ.. 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భువన్ సర్వేతో ఇళ్లకు కొలతలు నిర్వహించి జియో ట్యాగింగ్ చేస్తూ అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీచేసిందన్నారు. ఆ ఆదేశాలతో 2021లో భువన్ అప్‌డేట్ జరిగి, సాంకేతిక కారణాలతో ఇంటి పన్నులు అప్‌డేట్ కాలేదన్నారు. వీటిని సీ అండ్ డీఎంఏ పురపాలక పరిపాలనశాఖ అసెస్‌మెంట్ పన్నులు అప్‌డేట్ చేయాలని ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఆ ఆదేశాల మేరకు మిగిలిపోయిన అసెస్‌మెంట్లకు ఇంటి పన్నులు అప్‌డేట్ చేసినట్లు వివరించారు. పెరిగిన ఇంటి పన్నులపై ఈనెల 24న జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు పన్నులు తగ్గించుటకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వివరించారు. ఇంటి పన్నుల పెంపుపై అపోహలు, అభ్యంతరాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని జ్యోతికృష్ణ సూచించారు.

నాచగిరి క్షేత్రంలో శ్రావణ మాస సందడి

● సామూహిక సత్యనారాయణ స్వామి

వ్రతంలో పాల్గొన్న దంపతులు

వర్గల్, ఆగస్టు 31: నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా క్షేత్రాన్ని భక్తులు భారీగా తరలివచ్చారు. అలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించగా 60 జంటలు సత్యదేవుడి వ్రతాల్లో పాల్గొన్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

విద్యాదరి క్షేత్రంలో శని త్రయోదశి

వర్గల్, ఆగస్టు 31: వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శనైశ్చరాలయంలో శని త్రయోదశి మహోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం శని త్రయోదశి మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. శనైశ్చరుడికి తైలాభిషేకాలు చేసేందుకు దోశ నివారణ కోసం ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు.

ఘనంగా వాగుగడ్డ హనుమాన్ జాతర

తొగుట, ఆగస్టు 31: తొగుట మండలం ఏటిగడ్డకిష్టాపూర్ గ్రామశివారులోని వాగుగడ్డ హనుమాన్ ఆలయం వద్ద శనివారం జాతర ఘనంగా జరిగింది. శ్రావణ మాసం చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయం వద్ద ట్రాక్టర్‌లు, వాహనాలు, ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి డీసీసీఅధ్యక్షుడు నర్సారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు చేరుకుని పూజలుచేయగా ఆలయ అర్చకులు వారిని ఘనంగా సన్మానించారు. ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు దాతారు రవీంధర్‌రావు పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లికి మంగళహారతులు

చిన్నకోడూరు, ఆగస్టు 31: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి మంగళహారతులు సమర్పించారు. ఈ సందర్భంగా వేదపండితులు సంగీత్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం సభ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, తమ పిల్లాపాపలను సల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మర్కుక్, ఆగస్టు 31: మండలంలోని గణేష్‌పల్లి గ్రామంలోని పురాతన బాట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి ఆలయ పురోహితులు ఉపేందర్ ఆధ్వర్యంలో స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, తాజా మాజీ సర్పంచ్ మంజుల శ్రీరాములు, తాజా మాజీ ఉపసర్పంచ్ మహేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



వర్గల్: నాచగిరిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

దుబ్బరాజేశ్వరస్వామి జాతర

దుబ్బాక, ఆగస్టు 31: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా నిర్వహించే అక్బర్‌పేట- భూంపల్లి మండలం చౌదరపల్లి గ్రామ స్వయంభూ దుబ్బరాజేశ్వర స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా శ్రావణ మాసం చివరి శని, సోమవారం జాతర నిర్వహిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు దుబ్బ రాజశర్మ, భానుశర్మలు నిర్వహించారు.



వర్గల్: విద్యాధరి క్షేత్రంలో శనిత్రయోదశి సందర్భంగా శని పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మర్కుక్: లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న ప్రతాప్‌రెడ్డి



తొగుట: వాగుగడ్డ హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



చిన్నకోడూరు: పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళహారతులతో మహిళలు

సిద్దిపేటకు సిడ్రా రావాలి

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 31: గత ప్రభుత్వ పాలనలో సిద్దిపేటలోని చెరువులు, కుంటలు, నాలాలు కొందరు నాయకుల కబంధ హస్తాల్లోకి వెళ్లాయని, కబ్జా చేసిన స్థలాలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి వెంటనే తిరిగి స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో హైడ్రాలాగే సిద్దిపేటలో కూడా సిడ్రా రావాలన్నారు. పట్టణంలో ఎన్నో చెరువులను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే తాను స్వయంగా అడ్డుకున్నానని తెలిపారు. రెవెన్యూ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు సిద్దిపేటలో ఉన్న చెరువు శిఖం భూములను గుర్తించే పనిలో ఉండాలని కోరారు. చెరువుకు సంబంధించిన భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకునేలా ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, రాశాద్, సందీప్‌యాదవ్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న ఆరు టిప్పర్ల సీజ్



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

చేర్యాల, ఆగస్టు 31: కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామశివారులోని రైల్వేబ్రిడ్జి సమీపంలోని ప్రభుత్వభూమి నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు. కొండపాకకు చెందిన రేపాక రాజు, తిరుపాటి రాజు, గురువన్నపేటకు చెందిన పూలమైన తరుణ్, కోనాయపల్లికి చెందిన దున్నపోతుల జంపయ్య, సిద్దిపేటకు చెందిన శివరాత్రి యాదగిరి, మర్పడగకు చెందిన సంపంగి రాజు, కుకునూరుపల్లికి చెందిన మనోజ్ రాజు తదితరులు శుక్రవారం రాత్రి ఎక్సకవేటర్ సహాయంతో మట్టి తవ్వుతున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడులు చేశామని, పట్టుబడిన ఎక్స్‌కవేటర్, ఆరు టిప్పర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కుటుంబసభ్యుల వివరాలను అందజేయాలి

● గజ్వేల్ ఏడీఏ బాబునాయక్

రాయపోల్/గజ్వేల్/కొండపాక, ఆగస్టు 31: సాంకేతిక కారణాల వల్ల పంట రుణాలు మాఫీ కాని రైతులు వారి కుటుంబ సభ్యుల వివరాలను అందజేయాలని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ పేర్కొన్నారు. మండలంలోని మంతూరులో ఏవో నరేష్‌తో కలిసి రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని భరోసా ఇచ్చారు. ఆయనవెంట ఏఈవోలు కవిత, ప్రవీణ్, రైతులు ఉన్నారు.

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ నిర్ధారణకు రైతులు సహకరించాలని వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ కోరారు. గజ్వేల్ మండల పరిధిలోని సింగాటం, క్యాసారం, పిడిచేడ్ గ్రామాల్లో నిర్వహిస్తున్న కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఆయనవెంట గజ్వేల్ వ్యవసాయ అధికారి గుండు నాగరాజు, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

రుణమాఫీలో భాగంగా ఆధార్‌లో బ్యాంక్ అకౌంట్‌లో పేరు వేరుగా ఉండి రుణమాఫీ కాని రైతులు వారు లోన్ తీసుకున్న బ్యాంకును సంప్రదించాలని వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ తెలిపారు. పేరు ఆధార్‌లో ఉన్నట్టుగా బ్యాంకు ఖాతాలో లేకపోతే దీనికి సంబంధించిన ఆధార్ సవరణకు ప్రభుత్వం బ్యాంకులకు అవకాశం ఇచ్చిందని, తప్పులున్న రైతులు బ్యాంకులకు వెళ్లి సెప్టెంబర్ ఏడు లోపు మార్పు చేసుకోవాలని సూచించారు.

సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

● బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 31: గ్రామాల్లో అభివృద్ధి పనులను చేసిన తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు అయిలేని మలికార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను చేసేందుకు ప్రైవేట్ ఫైనాన్స్‌ల్లో అప్పులు తెచ్చారని, ఇప్పటికీ ఆ పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ. అన్వర్, నాయకులు సూరంపల్లి పరశురామ్, పుల్లూరి శ్యామ్, మాటూరి ప్రేమ్‌కుమార్, రాజునాయక్, లక్ష్మన్ తదితరులున్నారు.

గ్రామ స్థాయి నుంచే సభ్యత్వ నమోదుకు శ్రీకారం

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 31: గ్రామ, పట్టణ స్థాయి నుంచే భారీగా బీజేపీ సభ్యత్వ నమోదును విస్తృతంగా నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టినట్లు ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సెన్సార్‌బోర్డు సభ్యులు లక్కిరెడ్డి తిరుమల పేర్కొన్నారు. హుస్నాబాద్ మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో నరేంద్రమోదీ నాయకత్వంవైపు యువత మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు స్వీకరించేందుకు ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెల్దండి ప్రసాద్ గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరం

● గజ్వేల్ సీఐ బి సైదా, ట్రాఫిక్ సీఐ మురళి

గజ్వేల్ ఆగస్టు 31: మైనర్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని గజ్వేల్ సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాల శనివారం నూతన చట్టాలు, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియమాలు, గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలని దృష్టిలో పెట్టుకుని బాగా చదవాలని, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వారి వెంట ప్రిన్సిపాల్ మట్టయ్యచౌదరి, కరస్పాండెంట్ అంబదాసు, అధ్యాపకులు, భరోసా సిబ్బంది హరిత, అనూష, గజ్వేల్ షీ టీం సిబ్బంది శ్రీరాములు, మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

కుల, మతాలకు అతీతంగా కలసి ఉండాలి

● ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, ఆర్‌ఐ ప్రభాకర్‌రావు



మాట్లాడుతున్న ఎస్‌ఐ, ఆర్‌ఐ

దౌల్తాబాద్, అగస్టు 31: ప్రతి ఒక్కరూ కుల, మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని ఎస్‌ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్, ఆర్‌ఐ ప్రభాకర్‌రావు సూచించారు. మండల పరిధిలోని కోనాపూర్‌లో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ, ఆర్‌ఐ గ్రామస్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సాయిలు, పంచాయతీ కార్యదర్శి ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా రోటరీ సేవలు

ములుగు, ఆగస్టు 31: మహిళల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా రోటరీక్లబ్ కృషి చేస్తున్నదని రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు సామల నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని అన్నాసాగర్‌లో శనివారం ఐదుగురు మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబంలో మహిళలే ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తారన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, క్లబ్ చైర్మన్లు కరుణాకర్‌రెడ్డి, జగదీశ్వర్, పూర్వ అధ్యక్షుడు నరసింహారెడ్డి, క్లబ్ సభ్యుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి'

ములుగు, ఆగస్టు 31: రాష్ట్ర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు మాజీ సర్పంచ్ బాలేష్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌లో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, వడ్ల శ్రీనివాస్, అశోక్ తదితరులున్నారు.

అంబేడ్కర్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్‌గా శ్రదానందం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 31: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని సిద్దిపేట అంబేడ్కర్ విద్యా కేంద్రం సమన్వయ కర్తగా ఎం. శ్రద్ధానందం నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన సిద్దిపేట అంబేడ్కర్ రీజనల్ సెంటర్ కో ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా శ్రద్ధానందంను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత, అధ్యాపక బృందం అభినందించారు.

క్రీడాకారిణికి ఆర్థిక సహాయం..

గజ్వేల్, ఆగస్టు 31: జాతీయ క్రీడాకారిణి, ఇటీవల పీఈసెట్ ఎంట్రెన్స్ రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంకు సాధించిన కె.అంజలి వ్యాయామ విద్య కోర్సు చేయడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలుసుకుని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రస్తుతం రూ.5వేలను అందిచామని, రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేయడానికి అవసరమగు ఆర్థిక సహాయాన్ని సమకూరుస్తుందని ఫౌండేషన్ చైర్మన్ ఎం.ఎస్.కే హైదర్‌పటేల్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఎస్.విజయరేఖ, ఫౌండేషన్ సభ్యులు ఎన్.గోవర్ధన్‌రెడ్డి, ఎ.నవీన్, కె.జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి..

మిరుదొడ్డి, ఆగస్టు 31:మండల కేంద్రమైన మిరుదొడ్డి గ్రామానికి చెందిన నిరుపేద దంపతులైనా మల్లయ్య లచ్చవ్వలకు శనివారం సీనియర్ జర్నలిస్టు ర్యాకం నర్సింహులు సహకారంతో నిత్యావసర సరుకులను ఏఎంసీ మాజీ చైర్మన్ భూమాగౌడ్‌లు అందజేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం బేగంపేట గ్రామానికి చెందిన అనుషిత(2)అనే చిన్నారి కుక్కలదాడిలో తీవ్రగాయాలై హైద్రాబాద్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. శనివారం బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన హనుమాన్ యూత్ సభ్యులు రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన బండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్, ఆగస్టు 31: గజ్వేల్ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు కోరారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో సీఎంతో ఆయన శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో ముంపు గ్రామాల ప్రజలతో పాటు నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

● కేంద్ర సహాయ మంత్రి 'బండి'కి వినతి



బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బెజ్జంకి, ఆగస్టు 31: బెజ్జంకి మండలంలో ఉన్న పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ శనివారం స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పులేటి బాబు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి కరీంనగర్‌లో వినతిపత్రం అందజేశారు. మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు బాబు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, శ్రీనివాస్, బండి శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన మాజీ సర్పంచ్

కుకునూరుపల్లి, ఆగస్టు 31: నిధుల మంజూరు కోసం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ ఐలెం యాదవ్, కురుమ, యాదవ సంఘం కులపెద్దలు శనివారం భువనగిరిలో కలిసి వినతి పత్రం సమర్పించారు. మండల కేంద్రంలో ఉన్న బీరప్ప ఆలయం ప్రహరీ నిర్మాణం, ఆలయంలో మరో అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధుల మంజూరుకు బీర్ల ఐలయ్య సానుకూలంగా స్పందించారని ఐలంయాదవ్ తెలిపారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

● ఎంఎన్‌వో వెంకటరాములు

మర్కుక్, ఆగస్టు 31: నిర్దేశిత సమయంలో సిలబస్ పూర్తి చేయాలని మండల ఎంఎన్‌వో వెంకటరాములు అన్నారు. ఎంపీయూపీఎస్ అంగడికిష్టాపూర్ పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, ఉపాధ్యాయులు హారిక, సంతోషిమాత, చిన్నికృష్ణ తదితరులున్నారు.

'సమస్యల పరిష్కారానికి పోరాడాలి'

చేర్యాల, ఆగస్టు 31: విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ కార్యదర్శి తాడూరి భరత్ అన్నారు. శనివారం చేర్యాల మండలకేంద్రంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపు వహిస్తుండటం తగదన్నారు. అయా సమస్యల పరిష్కరించాలని సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న విద్యార్థి మహాగర్జనకు విద్యార్థులు తరలిరావాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు నస్రీన్, అజయ్, కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 1ని విద్రోహ దినంగా..

బెజ్జంకి, ఆగస్టు 31: సెప్టెంబర్ 1వ తేదీని విద్రోహ దినంగా పాటించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పెన్షన్ అనేది ఉద్యోగికి బిక్ష కాదు హక్కు అని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన డివిజన్, జిల్లా కేంద్రాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● సీజనల్ వాధ్యులపై అవగాహన పెంచాలి

● ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను, వసతి గృహాలను సందర్శించిన అధికారులు

నంగునూరు, ఆగస్టు 31: హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ సరిత పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో లక్ష్మప్ప, వైద్యాధికారి డాక్టర్ సరితతో కలిసి మండలంలోని పాలమాకుల షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ బాలుర హాస్టల్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వారివెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ అనురాధ, హాస్టల్ వార్డెన్ గణేష్, హెల్త్ అసిస్టెంట్ మహేందర్, పంచాయతీ కార్యదర్శి అనిత ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● **మర్కుక్:** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంపీడీవో అబ్జలుద్దీన్, డీ. దీప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో అబ్జలుద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా స్కావెంజర్‌లు పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప విద్యార్థులకు ఆరోగ్య సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారివెంట ఎంపీవో రాజలింగం, వైద్య సిబ్బంది, ఎస్‌వో భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **దుబ్బాక:** దుబ్బాక మండలం రామక్కపేట గురుకుల బాలికల కళాశాలను దుబ్బాక తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో భాస్కరశర్మ తనిఖీ చేశారు. పారిశుద్య సమస్య తీవ్రంగా ఉండడంతో ఎంపీడీవో గురుకులంలోని చెత్త, పచ్చిగడ్డిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం విద్యార్థినులకు అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. చింతపండు, పప్పుల సరఫరా సక్రమంగా లేదని మండిపడ్డారు. ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను త్రిమ్యాన్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలోని శానిటేషన్, విద్యార్థుల భోజన వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిల పై ఆరా తీశారు. ఆదర్శ పాఠశాలలో 20 మంది విద్యార్థులకు జ్వరాలు రావడంతో ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు. పాఠశాలలో వెంటనే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



మర్కుక్: మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్జలుద్దీన్

వైద్య సేవల్ని సద్వినియోగం చేసుకోవాలి

● వైద్యాధికారి నజియా ఫిర్దోస్

మద్దూరు, ఆగస్టు 31: యునానీ వైద్య సేవల్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నజియా ఫిర్దోస్ సూచించారు. మద్దూరు మండల కేంద్రంలో శనివారం యునానీ దవాఖానా ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 40 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అంద జేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాను తేజ, ఫార్మసిస్ట్ లింగం, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ఇందుప్రియల్ పాఠశాలలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్, ఆగస్టు 31: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే (సీపీఎస్) రద్దు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రాంత ఉపాధ్యాయ(తపస్) రాష్ట్ర అధ్యక్షుడు పబ్బతి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. దౌల్తాబాద్ మండలంలోని వివిధ పాఠశాలలో శనివారం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో(తపస్) సిద్దిపేట జిల్లా ప్రధానకార్యదర్శి చిలుముల మురళీధర్, నర్సరెడ్డి, మహేందర్‌రెడ్డి, కనకరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు రూ. 11లక్షలు మంజూరు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 31: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద క్యాంటీన్ ఏర్పాటుకు హుస్నాబాద్ పట్టణంలోని భవాని గ్రూపు సభ్యురాలు పచ్చిమట్ల స్వప్నకు శనివారం రూ. 11 లక్షల మంజూరు పత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు బోజు రమాదేవి, ముత్యాల రాజు తదితరులున్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు..

● గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి



రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ రియాజ్‌ను శాలుక కప్పి సన్మానిస్తున్న నాగపురి కిరణ్

చేర్యాల, ఆగస్టు 31: చేర్యాల పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న గ్రంథాలయాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ రియాజ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి గ్రంథాలయ దుస్థితిని వివరించారు. ఆయనవెంట నాయకులు రాగుల శ్రీనివాస్‌రెడ్డి, దాసరి శేఖర్, వెంకిర్యాల రవి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పటిష్ఠతకు దాతల సహాయం మరువలేనిది

● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కుకునూరుపల్లి/రాయపోల్, ఆగస్టు 31: ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠ పరచడానికి తమ వంతు సహాయం చేస్తున్న దాతల సేవలు మరువలేనివని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. లకుడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఐదు గదులకు రూ. 50వేల విలువచేసే గ్రిల్స్‌ను అందించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా శనివారం గ్రిల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జానకీరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు స్వర్గం చంద్రయ్య ఉద్యోగ విరమణ సభలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, ఎంఈవో నర్సమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

● సిద్దిపేట ఏసీపీ మధు, ఆర్డీవో సదానందం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 31: వినాయక చవితి, నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు, ఆర్డీవో సదానందం అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనం తదితర అంశాల గురించి సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట ఆర్డీవో సదానందం వివిధ శాఖల అధికారులతో కలసి సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు మాట్లాడుతూ.. విద్యుత్, మున్సిపాలిటీ, ఫైర్, పోలీస్ వివిధ శాఖల వారు నిమజ్జనాల దగ్గర ఏర్పాట్లు చేయాలని, తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పండుగలు కలిసి మెలిసి జరుపుకుని జిల్లాను ఆదర్శంగా నిలపాలని ప్రజలకు, మండపాల ఏర్పాటు దారులకు సూచించారు. వినాయక మండపాల నిర్వహకులకు పలు సూచనలు చేశారు.

● మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలి

● రాబోవు రోజులలో వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉన్నందున మండపాలు ఏర్పాటు చేసుకునేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని

● మండపాల వద్ద ఒక వలంటరీ ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి

● అన్ని శాఖల అధికారుల పేర్లు, సెల్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీని మండపం దగ్గర ఏర్పాటు చేసుకోవాలి

● శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరిగేటట్లు మండప నిర్వహకులు, ఆర్గనైజర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో ఏఈ ఇరిగేషన్ శ్రీధర్, సిద్దిపేట మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్, విద్యుత్ ఏఈలు కొమురయ్య, మహేందర్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, సిద్దిపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ శ్రీను, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో శనివారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయాలని అన్నారు. డిజేలకు అనుమతి లేదని, రెండు బాక్సులతో కూడిన లౌడ్ స్పీకర్లను మాత్రమే పెట్టుకోవాలన్నారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే మైక్‌కు అనుమతి ఉందని, అనంతరం మైకును వినియోగించుకోవద్దన్నారు. ఆయన వెంట విద్యుత్ శాఖ ఏఈ మారుతి, ఎస్‌ఐ శంకర్ ఉన్నారు.



సిద్దిపేట క్రైం: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు, ఆర్డీవో సదానందం